క్లుప్తంగా

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని చిన్న చల్మెడలో ఈ నెల 29వ తేదీన ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా బుధవారం చిన్నచల్మెడ గ్రామ శివారులో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పర్యటించారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించేందుకు మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, తహసీల్దార్ శివకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: మొగుడంపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సంజుకుమార్ ఇటీవల ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. దీంతో బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కుత్‌బుద్దీన్, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేయాలి



మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: రైతులకు పట్టా పాస్‌బుక్‌లు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి వెబ్‌సైట్‌లో పాస్‌బుక్‌లు రానివారు దరఖాస్తు చేసుకుని ఐదారు నెలలు గడుస్తున్నా నేటికీ పట్టా పాస్‌పుస్తకాలు రాకపోవడం విచారకరమన్నారు. తహసీల్దార్‌ల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పాస్‌బుక్‌లు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు చంద్రన్న, ప్రకాష్, దక్షిణమూర్తి, సలీమోద్దీన్, నర్సింలు, సంజీవ్, బక్కన్న పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత సంఘాల నాయకులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహం, బుద్ధుని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీకాట్ ఎండీ, రైతు నాయకులు ఢిల్లీ వసంత్, బీఆర్‌ఎస్ నాయకులు విజయ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మక్బూల్, కేవీపీఎస్ జిల్లా నాయకులు మహేష్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య పాల్గొన్నారు.

సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నగేష్

జహీరాబాద్ టౌన్: వీఓఏల సమ్మె విరమణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న వీఓఏల శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, సహాయ కార్యదర్శి మహిపాల్, యూనియన్ నాయకులు శంకర్, మంజుల, అశోక్, అన్నపూర్ణ, మజీద్, లక్ష్మీ, అనుసూజ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- నేలవాలిన పంటలు, తడిసిన ధాన్యం
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం



హత్నూర: కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



కల్హేర్: రాంరెడ్డిపేట్‌లో వరిపంటను పరిశీలిస్తున్న ఏఈఓ భాస్కర్



జిన్నారం: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



నారాయణఖేడ్: కొత్తపల్లిలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



హత్నూర: దూడ కళేబరం



కల్హేర్‌లో..

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో నాగల్‌గిద్ద మండలంలో 50.8మిల్లీమీటర్లు, ఖేడ్‌లో 30.2, మనూరులో 22.4, కల్హేర్‌లో 18.8, సిర్గాపూర్‌లో 13.5, కంగ్టిలో 11.8 మిల్లీమీటర్లుగా నమోదు అయ్యింది. నిజాంపేట్ మండలం కొత్తపల్లి శివారులో 150 మందికి పైగా రైతులకు సంబంధించిన 300 ఎకరాల వరకు వరిపంట పూర్తిగా నేలవాలి గింజలు రాలిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఈవో వంశీకృష్ణ ఆయా ప్రాంతాల్లో వరిపొలాలను పరిశీలించి నష్టం అంచనాలను నమోదు చేసుకుని చర్యలు చేపట్టారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో పాటు నీటి వరదకు కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సిరిపురం శివారులో పిడుగుపాటుకు మహిపాల్‌రెడ్డికి చెందిన దూడ మృతి చెందింది. మండలంలో 17 విద్యుత్ స్తంభాలు గాలివానకు విరిగినట్లు ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

రైతన్నకు కడగండ్లు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం రాంరెడ్డిపేట్‌లో మంగళవారం రాత్రి కురిసిన అకావర్షంతో 66 ఎకరాల్లో వరిపంట నెలరాలింది. ఏఈఓ భాస్కర్, మాజీ సర్పంచ్ ఈశ్వర్ పంటలను పరిశీలించారు. 33 శాతంపైగా వరిపంట దెబ్బతిందని, ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఏఈఓ తెలిపారు. దామర్‌చెరువు, ఖానాపూర్(బి), బాచేపల్లి, మీర్ఖాన్‌పేట్, రాపర్తి, కల్హేర్, మార్డి, తదితర చోట్ల వరి, జొన్న, తదితర ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. దేవునిపల్లిలో గ్రామానికి చెందిన మల్లవ్వ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

నష్టపోయిన పంటల పరిశీలన

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాలవర్షానికి కొత్తపల్లిలో 250 ఎకరాలు, రాంరెడ్డిపేట్‌లో 66 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనావేశామని మండల వ్యవసాయ అధికారి శంకర్ పేర్కొన్నారు. ఏఈవోలు వంశీ, భాస్కర్ ఆయా గ్రామాల శివార్లలో బుధవారం నష్టపోయిన పంటలను పరిశీలించారు.

నేలవాలిన వరిపంటలు

జిన్నారం(పటాన్‌చెరు): అకాల వర్షాలు కురుస్తుండటంతో గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియజేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, రైతులు

జోగిపేట(అందోల్): జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూరాకుల రాజయ్య డిమాండ్ చేశారు. జోగిపేట మార్కెట్ యార్డులో తడిసిన వడ్లను బుధవారం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి, సీపీఎం డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మార్కెట్ కమిటీ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వారం రోజుల నుంచి రైతులు మార్కెట్ యార్డ్‌కు వడ్లు తీసుకువచ్చి పడికాపులు కాస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి జిల్లావ్యాప్తంగా వరి, కూరగాయలు, పండ్ల తోటలు, మొక్కజొన్న, ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మల్లన్న, మొగులయ్య, మల్లేశం, శంకరయ్య, నరసమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయ పెంపునకు కృషి చేయాలి



అరుణకుమారిని సన్మానిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: వచ్చేనెలలో వివాహాలు అధికంగా ఉన్నందునా ఆర్టీసీ సంస్థ ఆదాయం పెంచేవిధంగా కృషి చేయాలని చూడాలని ఆర్టీసీ ఆర్‌ఎం సుదర్శన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన ఛాలెంజ్ ఫర్ ట్రేనింగ్ ట్రాక్ పేరిట డ్రైవర్లు, కండక్టర్ల శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవాపూర్ మంజీరా కుంభమేళాకు రాకపోకలు సాగించే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైనన్ని బస్సులు నడపాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక జీవితభీమా సంస్థ బ్రాంచి మేనేజర్ అరుణకుమారి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేవిధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం అరుణకుమారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ సెల్‌ఇన్‌చార్జి పాండు పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి

ఝరాసంగం(జహీరాబాద్): తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 28నుంచి చేపట్టే సమ్మెకు ప్రతిఒక్కరూ సహకరించాలని మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు బుధవారం ఝరాసంగం మండల కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ క్రిష్ణలకు వేరువేరుగా వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శివప్రసాద్‌స్వామికి వైదిక పురోహితరత్న నంది పురస్కారం



వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామానికి చెందిన శివప్రసాద్‌స్వామికి వైదిక పురోహితరత్న నంది పురస్కారం వరించింది. పురోహితవిద్య అభ్యసించడంలో ప్రతిభ కనబర్చిన సందర్భంగా ఆయనను నంది అవార్డుతో పాటు మెమెంటోతో సత్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ నిలయంలో శ్రీతనయన సాంస్కృతిక కళానిలయం ఆధ్వర్యంలో ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జహీరాబాద్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జహీరాబాద్ మండల పరిధిలో గుర్తింపు లేకుండా శాంతినికేతన్ విద్యాలయం, జూనియర్ కాలేజ్ స్కూల్ ఒకే బిల్డింగ్‌లో నడిపిస్తున్నారని, శ్రీచైతన్య పాఠశాల కమర్షియల్ బిల్డింగ్‌లో ఫోర్త్ ఫ్లోర్లో నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారన్నారు. బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్ కమర్షియల్ బిల్డింగులో ఉందని, నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి గుర్తింపులేని పాఠశాలలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, సహాయ కార్యదర్శి రాజేష్ రాహుల్ పాల్గొన్నారు.

మన ఊరు-మనబడి పనులను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): మన ఊరు- మనబడి పనులను మే నెల చివరినాటికి పూర్తి చేయాలని మనఊరు-మనబడి చీఫ్ ఇంజనీర్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం వట్‌పల్లి మండల పరిధిలోని నాగులపల్లి, నిర్జప్ల, అందోల్ మండల పరిధిలోని నేరడిగుంట పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులు పూర్తి కాగానే రెండో విడతగా మరిన్ని పాఠశాలలకు నిధులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ రాంకుమార్, పీఆర్ ఏఈ మొగులయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ లావణ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య, రోడ్లు, కరెంటు, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

అధికారులు గైర్హాజరు

మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. దీంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రవీందర్, ఎమ్మార్వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఐకేపీ వీఓఏల సమ్మె



జోగిపేట: నిరసన తెలుపుతున్న వీఓఏలు

సంగారెడ్డి టౌన్: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారంతో 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా బుధవారం సంగారెడ్డిలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అనిత, బీఎస్పీ, వివిధ సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

మునిపల్లి(అందోల్): వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ, వీఓఏలు మునిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కార్యక్రమంలో మొగులయ్య, రాము, వినోద, దినకర్‌బాబు, లింగమయ్య, నర్సింలు, అపిత, స్వరుప, ప్రవీణ్, అనిత, సంతోష, శేఖర్, అంజయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారంతో 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వీఓఏలు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీఓఏల నాయకులు కిష్టయ్య, లక్ష్మయ్య, మల్లేశం, కృష్ణయ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె బుధవారంతో 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ముందు రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, ఐకేపీ వీఓఏల జిల్లా కోశాధికారి మల్లన్న, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయ హుండీని బుధవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ శివరాజ్, ఈఓ మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించారు. ఆరు నెలల నుంచి భక్తులు సమర్పించిన నగదు రూ.4,65,101లుగా తేలిందని అధికారులు పేర్కొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): కంటివెలుగు శిబిరాలను సద్వినియోగంచేసుకోవాలని ఎంపీపీ సరళ పుల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధకార్మాగారం ఎస్టేట్లోని పాతపోలీస్‌స్టేషన్ భవనంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వరకుమార్, సర్పంచ్ మల్లారెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని కోడూర్ గ్రామంలో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సర్పంచ్ కృష్ణ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ భవనంలో నాలుగు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు. కంటి సమస్యలున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఈఐఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి పొందేందుకు కేంద్ర టెలికాం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎస్‌ఐ విజయకృష్ణ సూచించారు. గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మల్లేశం అనే వ్యక్తి పాల వ్యాపారం చేస్తుంటాడు. మల్లేశంకు సంబంధించిన సెల్‌ఫోన్ ఈనెల 3న పోయింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విజయకృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తును చేపట్టారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ రూపొందించిన సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) ద్వారా మల్లేశం పాగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసి ఫోన్‌ను మల్లేశ్‌కు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో బుధవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ పుష్పనగేష్, జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ బాలయ్య దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు.

◆ **నేడు మైనార్టీ కార్పొరేషన్ ఇంటార్వ్యూలు**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటార్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీజీవీబీ సంజీవన్‌రావుపేట్ బ్యాంక్ పరిధిలోని గ్రామాల దరఖాస్తుదారులు హాజరుకావాలని సూచించారు.

◆ **వర్షపునీరు నిల్వకుండా చర్యలు**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతినగర్ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, నాయికోటిబస్తీ, ముదిరాజ్ బస్తీలో ఏఈ ప్రవీణ్‌తో కలసి బుధవారం పర్యటించారు. మ్యాన్‌హోల్స్‌లో నిండిన వ్యర్థాలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు.

◆ **వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**



జహీరాబాద్ టౌన్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ జిల్లా నాయకుడు నిజామొద్దీన్, రషీద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జహీరాబాద్ కోర్టు ఆవరణలో చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలోమన్, న్యాయవాదులు శ్రీనివాస్, శ్రీనివాస్ ఖన్న, రుద్రయ్యస్వామి, కార్తీక్‌గౌడ్, జనార్దన్, చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

◆ **కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామ బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కోసిగే శేఖర్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బుధవారం ఆయన ఇంటికి పరామర్శించారు. శేఖర్‌కు మెరుగైన వైద్యం అందిస్తామని కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. పలువురు టీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

◆ **చలివేంద్రం ఏర్పాటు**



నారాయణఖేడ్: మండల పరిధిలోని రుద్రారంలో భూలక్ష్మి నాగదేవత జాతర కొనసాగుతున్న నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ ఏర్పాటు చేయించిన చలివేంద్రాన్ని బుధవారం సర్పంచ్ సువర్ణప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పండరిగౌడ్, భూమయ్య, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **ఎల్లమ్మ జాతరకు విరాళం అందజేత**



పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పాశమైలారం గ్రామంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఎల్లమ్మ జాతరకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయడు నీలం మధు రూ.లక్ష విరాళం ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యుల ద్వారా నిర్వాహకులకు అందజేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ **హుండీలో అమెరికన్ డాలర్ నోట్లు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ హుండీని లెక్కిస్తున్న సందర్భంలో గుర్తుతెలియని భక్తుడు హుండీలో వేసిన అమెరికన్ డాలర్ నోట్లను అధికారులు గుర్తించారు. మూడు ఒక డాలర్ నోట్లు ఉండగా వాటిని హుండి లెక్కింపు నుంచి మినహాయించారు. నోట్లపై 2013లో ముద్రించిన సీరిస్‌కు చెందినట్లుగా ప్రింట్ అయి ఉంది. ఫారన్ ఎక్చేంజ్ అనంతరం ఆ నోట్లను ఆలయ హుండీ లెక్కింపులోకి తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

◆ **ఉపకార వేతనాలకు దరఖాస్తుల గడువు పొడగింపు**

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి జిల్లాలోని దివ్యాంగుల ఉపకార వేతనాలకు గడువు పొడిగిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 5వ తేదీవరకు htt pr://-tso bm-m-r.-c-f-f. gov. i n // మన వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షంనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కార్పొరేటర్ పుష్పనగేష్ క్షేత్రస్థాయి పర్యటించి వర్షపు నీటిని మళ్ళించేందుకు చర్యలు తీసుకున్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి బుధవారం కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.